
# సింగిల్ పేజీ కథలు

# వేదాంతి



**తన గమ్యస్థానం రావటంతో సూట్‌కేస్ పట్టుకొని ట్రైన్ దిగాడు రామారావు. వాచీ చూసుకున్నాడు. రాత్రి పదకొండు గంటలయింది.**

శీతాకాలమేమో స్టేషన్ చాలా నిర్మానుష్యంగా ఉంది. తనతో యింకో నలుగురయిదుగురు మాత్రమే దిగినట్లున్నారు. ట్రైన్ లేట్ కావడంతో యీ టైమ్ అయింది. ఈ సమయంలో ఆటోలు గానీ రిక్షాలు గానీ సాధారణంగా దొరకడం కష్టం. ఆటో దొరుకుతుందో లేదోనని సంశయిస్తూ స్టేషన్ బయటకు దారితీసాడు.

ఉన్న ప్రయాణికుల్ని పట్టుకొని అప్పుడో బయలుదేరినట్లున్నాయి. ఒక్క ఆటో కూడా కనబడలేదు. రిక్షాలు కూడా ఏవీ లేవు. చేసేది లేక సూట్‌కేస్, బ్యాగ్ పట్టుకొని నడక ప్రారంభించాడు రామారావు, దారిలోనైనా ఏ ఆటోగానీ, రిక్షాగానీ దొరకకపోతుందా అని. అతని యిల్లు అక్కడికి చాలా దూరం. పైగా ప్రయాణం బడలిక.

అయితే ఓ పాతిక అడుగులు వేసే సరికి అక్కడ రోడ్డుమీద ఒక రిక్షా ఆగి ఉంది. రిక్షా అతనికి వయసు యాభై పైబడినట్లు ఉంది. పూర్తిగా నెరిసిన జుట్టు, ముడతలు పడ్డ శరీరం. వణుకుతున్న కంఠం, ఒంటిమీద అతుకుల బొంత చొక్కా, అతను రిక్షా అంత దూరం తొక్కగలడా అని ఓ క్షణం సందేహించాడు రామారావు.

"బాబూ రిక్షా కావాలా?"

అసలే తన యిల్లు చాలా దూరం. పైగా గతుకుల రోడ్డు గల కాలనీ. వయసుపైబడ్డ ఆ రిక్షా అతను అంత దూరం తీసికెళ్లగలడా అని ఆలోచిస్తూంటే,

"బాబుగారూ, బోణీ యివాళ ఎందుకో పడలేదు పొద్దుట నుంచి.. మీరెంత అనుకుంటే అంతే యివ్వండి" అన్నాడతను.. రామారావు మౌనంగా నిలబడటం గురించి మరో విధంగా అనుకుంటూ.

ఇంకో ప్రత్యామ్నాయం లేకపోవడంతో, రిక్షా ఎక్కబోతూ..."నీలాద్రి నగర్ వస్తావా?" అని అడిగాడు.

అక్కణ్నుంచి చాలా దూరం పైగా గతుకులు, ఎత్తు పల్లాలతో కూడిన కాలనీ రోడ్డు, ఎక్కడ రాదంటాడోనని సందేహిస్తూ.

"పదండి బాబుగారూ" అంటూ రిక్షా బయలుదేరదీసాడు. మారు మాట్లాడకుండా రిక్షా ఎక్కాడు రామారావు. పాపం అతనికి ఎంత అవసరంగా ఉందో, రాత్రి పూట రిక్షా కట్టడానికి ఒప్పుకున్నాడు అని. ఉదయం వేళైతే సాధారణంగా పదిహేను రూపాయల వరకూ తీసుకుంటారు. తను పాతిక రూపాయలు ఇవ్వాలని మనసులోనే నిశ్చయించుకున్నాడు రామారావు.

మెల్లగా రిక్షా తొక్కుతున్నాడు అతను. రామారావుకి చల్లగాలికి హాయిగా తోచింది. ప్రయాణం బడలిక వల్ల చాలా అలసటగా ఉంది. రిక్షాలో వెనక్కు వాలాడు.

రామారావు రిటైరై అయిదేళ్ళు దాటింది. భార్య లేదు. ఉన్న కొడుకులిద్దరూ విదేశాల్లో ఉన్నారు. ప్రస్తుతం ఒంటరివాడు. ఎప్పుడోకానీ పిల్లలు రారు. అతనికి ఒంటరితనం భరింపరానిదైంది. అందుకే అతను ఏడాది పొడుగునా తీర్థయాత్రలకి వెళుతుంటాడు. ఆశ్రమాలకి తిరుగుతుంటాడు. వీలయినప్పుడు వృద్ధాశ్రమాలకి, అనాథ ఆశ్రమాలకి వెళ్ళి సహాయ సహకారాలు అందిస్తుంటాడు. స్వామీజీల ప్రసంగాలు వింటూ అనేక ధార్మిక, ఆధ్యాత్మిక, వేదాంత కార్యక్రమాల్లో పాలుపంచుకుంటాడు. ప్రస్తుతం యిదే అతని దైనందిన జీవనం. ఇప్పుడు అలాంటి కార్యక్రమాల్లో పాల్గొని తిరిగి వచ్చాడు.

రిక్షా గతుకుల్లో పడటంతో ఆలోచల్లోంచి బయటపడ్డాడు రామారావు. మెయిన్ రోడ్డు దాటి కాలనీ సందులోకి దారి తీసింది రిక్షా. ఇంకో కిలోమీటరు దూరం ఉంది ఇంటికి.

రిక్షా అతను కష్టపడి లాగుతున్నాడు. ఎత్తుపల్లాలు రావడంతో రిక్షా దిగి లాగడం మొదలుపెట్టాడు.

అతను అలా లాగుతుంటే అపరాధ భావం మొదలైంది రామారావులో. రిక్షాలో కూర్చోడం కష్టంగా తోచింది.

"కొంచెం రిక్షా ఆపు. నేను దిగి నడుస్తాను. గతుకులు పూర్తయ్యే వరకూ" అని లేవబోయాడు అతను, రిక్షా అతని కష్టం చూసి.

రిక్షా అతను ఆపకుండా, "ఏం ఫర్వాలేదు! మీరు కూర్చోండి. నేను లాగుతాను. ఇంకెంత ఆ కాసింత దూరం ఉంది" అన్నాడు.

"లేదయ్యా! ఎత్తు పల్లాలు గతుకులతో కష్టంగా ఉంది నీకు. నేను దిగుతాను. ఆపు రిక్షా"

రిక్షా అతను ఆపకుండా,

"బాబూ! ఏ జన్మలో ఏం చేశానో నాకు తెలియదుగానీ, యీ జన్మలో దేవుడు నాకు యీ పని అప్పగించాడు. నా కర్మ ఫలం నన్ను అనుభవించనీయండి. ఇప్పుడు రిక్షా లాగడం కష్టమని చెప్పి నా కర్మ ఫలం పెంచుకోలేను బాబూ. ఈ జన్మకింతే! ఈ జన్మలో నా పని సరిగ్గా నెరవేరిస్తే ఆ భగవంతుడు వచ్చే జన్మలోనైనా నన్ను కనికరించకబోడు" అన్న అతని మాటలు విన్న రామారావు ఓ క్షణం విస్తుపోయాడు. క్రిందటి జన్మలో అతని కర్మఫలం ఈ జన్మలో పూర్తి చెయ్యాలన్న అతని దృఢ సంకల్పాన్ని గమనించి, అతనిలోని 'వేదాంతి'కి మనసులోనే జోహారులర్పించాడు రామారావు.

**-డి.వి.డి.ప్రసాద్ (బరంపురం)**